## పెద్దకథ

### 'లోహియాని చంపెయ్యాలి' అని మరోసారి అనుకున్నాడు రాంబాబు


Saraswati Niketanam
Acc No
Vetapalem

# వేట

యం.రాధిక

అతను అలా అనుకోవడం అది ఎదవసారి

లోహియా పేరు గుర్తుకు రాగానే తన ప్రమోషన్ విషయం గుర్తుకు వస్తుం దతనికి ఆ వెంటనే లోహియాని చంపెయ్యాలి అనుకోవడం పరిపాటి అయిపోయింది

లోహియా అంటే మరెవరో కాదు రాంబాబు పై అధికారి అతను నార్త్ ఇండియన్ మార్కెటింగ్ విభాగంలో అతనికి తల పండి పోయింది చాలా పెద్ద కంపెనీలలో మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేశాడు అతని అనుభవం అదీ చూశాక రాంబాబు బాస్ భరద్వాజ తన కంపెనీకి మార్కెటింగ్ మేనేజర్‌గా లోహియాని పెద్ద జీతంమీద నియమించాడు

పదేళ్ళుగా మార్కెటింగ్ శాఖలో పడి కొట్టుకుంటున్నాడు రాంబాబు ఇవాళో రేపో తనని మార్కెటింగ్ మేనేజర్‌గా ప్రమోట్ చెయకపోరు అనే ధీమాతో ఉన్న రాంబాబు లోహియా రాకతో నీరుకారి పోయాడు అతను గాలిలో నిర్మించుకున్న ఊహా సౌదాలు కుప్పగా కూలిపోయాయి

లోహియా రిటైరయినా లేక మరణించినా ఆ పోస్ట్ రాంబాబుకి వస్తుంది అయితే లోహియా రిటైర్ కావడానికి ఇంకా చాలా టైముంది అందుకే అతను త్వరగా చావాలని భగవంతుడిని ప్రార్థించని రోజు లేదు

అయితే రాంబాబు ప్రార్థనల్ని ఆ దేవుడు వేరే పనులలో బిజీగా ఉండి పెడచెవిన పెట్టడంతో లోహియా నిక్షేపంగానే ఉన్నాడు పైగా పనిలో అలక్ష్యం చేసినందుకు అప్పుడప్పుడు రాంబాబుని చివాట్లు పెడుతూనే ఉన్నాడు

అందుకే లోహియాని చంపెయ్యాలని నిర్ణయించుకున్నాడు రాంబాబు

కానీ హత్య చేసిన తర్వాత పోలీసులు తనని పట్టుకుంటారేమో నన్న భయం అతనికుంది అందుకే ఏ ఆధారం దొరకకుండా ఆ హత్య చేయడానికి మార్గాలు అన్వేషిస్తున్నాడు రాంబాబు

ఉన్నట్టుండి అతనికి వేట అంటే ఇష్టమన్న సంగతి గుర్తుకు వచ్చింది రాంబాబుకి

రాంబాబు ఉంటున్న ఊరికి వంద కిలో మీటర్ల దూరంలో అనంతగిరి లోయలో దట్టమైన అడవి ఉంది ఆ అడవిలో చిరత పులులు జింకలు వగైరా జంతువులు ఉన్నాయి వాటిని వేటాడటం కోసం షికారీలు వెడుతుంటారు

లోహియా కూడా ఒక షికారియే ఆ ఊరికి వచ్చిన దగ్గర నుంచి దగ్గరలో అడవి ఉందని తెలుసుకుని వేటకు వెడదామని రాంబాబుని తెగ పోరుతున్నాడు రాంబాబు ఒకప్పుడు మంచి షికారీగానీ బరువు బాధ్యతలు నెత్తిన పడటంతో వేట అంటే ఆసక్తి నశించింది అందుకే ఎప్పటికప్పుడు ఏదో ఒక వంక చెప్పి వేటను వాయిదా వేస్తూ వస్తున్నాడు

ఇప్పుడు వేట విషయం గుర్తుకు రాగానే రాంబాబు తలలో ఒక ఆలోచన ఫ్లాష్‌లాగా మెరిసింది

వేట మిషతో లోహియాని అడవిలోకి తీసుకు వెళ్లి చంపవేస్తే!

అడవిలోకి వేటకు వెళ్లిన వారికి ప్రమాదాలు ఎదురవటం సహజం అలాంటి ప్రమాదమే లోహియాకీ జరిగిందని తను ప్రూఫ్ చేయగలిగితే చాలు

తన చేతికి మట్టిని అంటకుండా బయటపడవచ్చు అప్పుడు లోహియా కుర్చీ తన సొంతమవుతుంది

ఆ ఆలోచన అతన్ని స్థిమితంగా కుర్చీలో కూర్చోనివ్వలేదు దాంతో ఉండబట్టలేక లోహియా కేబిన్‌లోకి నడిచాడు

డోర్ తియ్యగానే ఎ ౦ ౦ చల్లని గాలి శరీరాన్ని తాకింది లోపల ఏదో ఫైలును పరిశీలిస్తున్న లోహియా తల తిప్పి రాంబాబు వేపు చూస్తూ యస్ అన్నాడు గంభీరంగా

మీరు ఆమధ్య వేటకు వెడదామన్నారు గుర్తుందా? అన్నాడు నెమ్మదిగా

వేట అనగానే మంత్రబద్ధుడిలాగా అయిపోయాడు లోహియా అంతవరకూ సీరియస్‌గా ఉన్న అతని మొహంలో కుతూహలం చోటు చేసుకుంది

ఫైలు మూసేస్తూ అవును ఎప్పుడు వెడదాం? అనడిగాడు లోహియా

వచ్చే మంగళవారం బుధవారం మనకు హాలిడేస్ కదా సార్ అప్పుడు వెడితే

బాగుంటుందేమోనని....'' కావాలనే వాక్యాన్ని పూర్తి చేయలేదు రాంబాబు.

లోహియా క్షణంసేపు ఏదో ఆలోచించి-"వెరి గుడ్ తప్పకుండా వెడదాం. మనిద్దరమేనా ఇంకా ఎవరైనా వస్తున్నారా?'' అడిగాడు.

ఆ మాటతో ఉత్సాహం తెచ్చుకుని-"మన జాకబ్, కిషోర్ కూడా వస్తారు సార్ వాళ్ళకి కూడా వేట అంటే ఇష్టమే'' అన్నాడు రాంబాబు.

వాళ్ళిద్దరు రాంబాబుకు జూనియర్స్.

"అలాగా. అయితే మీరు ఆ ఏర్పాట్లు చూడండి'' అని మళ్ళీ ఫైలులో తల దూర్చేశాడు లోహియా.

తృప్తిగా కాబిన్‌లోంచి బయటకు వచ్చాడు రాంబాబు.

అతని మెదడులో హత్యకు పథకం రూపు దిద్దుకోసాగింది.

* * * *

మంగళవారం ఉదయమే కిషోర్, జాకబ్‌లను తీసుకుని లోహియా ఇంటికి వచ్చేశాడు రాంబాబు.

అప్పటికే హంటింగ్ కిట్‌తో రెడీ అయి ఉన్నాడు లోహియా.

వీళ్ళని చూస్తూనే- "ఏం రాంబాబు? బయలుదేరదామా?'' అని ప్రశ్నించాడు లోహియా

"వెడదాం సర్'' అంటూ ఆఫీసు బోయ్ యాదగిరిని పిలిచాడు రాంబాబు.

అతను రాగానే తన వెంట తెచ్చిన ఫుడ్ పాకెట్స్‌ను, హాట్ కారియర్స్‌ను, పళ్ల బుట్టను ఇతర సామగ్రిని జీప్‌లో పెట్టించాడు రాంబాబు.

వెళ్ళేది అడవిలోకి కాబట్టి తినడానికి, తాగడానికి 'భారీ'గానే ఎరేంజ్‌మెంట్స్ చేశాడతను.

మరో పావు గంట తర్వాత వాళ్ళు ఎక్కిన జీప్ బయలుదేరింది.

అరగంట సేపు పట్నంలో రోడ్డు మీద ప్రయాణించి అడవికి దారితీసే ఘాట్ రోడ్డు ఎక్కింది జీపు.

డేంజరస్ ఘాట్ అది. ఒక పక్క ఎత్తయిన కొండలు, మరొక పక్క లోతయిన లోయలు మధ్యలో ఇరుకయిన రోడ్డు. డ్రైవర్స్ ఏమాత్రం ఏమరుపాటుతో ఉన్నా కొండతో ఢీకొనడమో, లోయలో పడిపోవడమో ఖాయం.

అందుకే తన దృష్టినంతా డ్రైవింగ్ మీదే కేంద్రీకరించి జీప్ నడుపుతున్నాడు డ్రైవర్

చల్లగాలి రివ్వున వీస్తూ వారి శరీరాలకు తాకుతూ గిలిగింతలు పెడుతోంది.

కబుర్లలో పడ్డారందరూ

తన వేట అనుభవాలను లోహియా పూస గుచ్చినట్లు వివరిస్తుంటే వింటున్నారు మిగతా వాళ్ళు.

కొంచెం దూరంలో దారికి అడ్డంగా కార్లు ఆగి ఉండటం గమనించి బ్రేక్ వేశాడు డ్రైవర్

కబుర్లు ఆపి "ఏం జరిగింది?'' అని అడిగాడు లోహియా.

"ఏదో యాక్సిడెంట్ అయినట్టుంది సార్ చూసి

## వేట

వస్తాను''. ఇంజన్ ఆఫ్ చేసి కిందకు దిగాడు డ్రైవర్

రెండు నిమిషాలు గడిచాయి

డ్రైవర్ ఇంకా తిరిగి రాలేదు

ఆ సస్పెన్స్‌ను భరించలేక పోయాడు లోహియా

ఇంతలో జీప్ పక్క నుంచి వెడుతున్న వ్యక్తిని ఆపి- "ఏమయిందండి?'' అని అడిగాడు

"ఎవరో షికారీ అండి పాపం! లోడ్ చేసిన గన్‌తో మంచె ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు గుండు పేలి తలలోంచి దూసుకు పోయింది ఏమి వేటగాళ్లో ఏమో! తుపాకి పట్టుకోవడం కూడా చేతకాదు'' అని ఒక చురక వేసి చక్కా పోయాడు

ఆ మాటలు వినగానే ఉండబట్టలేక-"రాంబాబూ వెళ్లి చూద్దాం పదండి'' అన్నాడు లోహియా కాలు కింద పెడుతూ

మౌనంగా అతన్ని అనుసరించారు మిగతా వాళ్ళు

కార్లని దాటుకుని కొంచెం ముందుకు వెడితే ఒక చోట జనం గుమికూడి ఉన్నారు

యాదగిరి ముందుకు వెళ్లి జనంలో దారి దారి చేస్తూ-"రండి సార్'' అని ఆహ్వానించాడు

లోపలికి వెళ్లి శవాన్ని చూశారు ఒక్కసారిగా వాళ్ళకి కడుపులో చెయ్యి పెట్టి కెలికినట్లయ్యింది

హతుడికి నలభై ఏళ్ళుంటాయి ఎర్రగా, లావుగా ఉన్నాడు. బట్టతల, తలలోంచి గుండు దూసుకు పోవడంతో ఆ బట్టతల ముక్క చెక్కలయి మెదడు బయటికి వచ్చింది

ఎక్కువసేపు ఆ శవం వంక చూడలేక పోయారు

"బ్యాడ్ లక్. ఇటీజె హంటింగ్ యాక్సిడెంట్' అన్నాడు లోహియా ఇవతలికి వస్తూ

ఎవరూ మాట్లాడలేదు మౌనంగానే జీప్‌ను చేరుకుని తమ సీట్లలో సర్దుకుని కూర్చున్నారు

కాసేపటికి రోడ్ క్లియర్ కావడంతో జీప్ బయలుదేరింది

అంతకు ముందు వసపిట్ట లాగ వాగిన లోహియా మౌనం వహించి గంభీర ముద్ర వహించాడు

బహుశా ఆ షికారి మరణం అతన్ని కదిలించి వేసుంటుందనుకున్నాడు రాంబాబు

మధ్యాహ్నం వేళకి ఫారెస్ట్ చేరుకున్నారు రాంబాబు అంతకు ముందే ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో రెండు గదులు బుక్ చేసి వుండటంతో సరాసరి అక్కడికే వెళ్లారు

ప్రయాణపు బడలికను పోగొట్టుకోవడం కోసం అందరు స్నానాలు చేశారు ఈలోగా యాదగిరి కారియర్లు విప్పి భోజనం సిద్ధం చేశాడు

ఆకలిగా ఉండటంతో ఆవురావురు మంటూ భోజనాలు కానిచ్చేశారందరూ

"సర్ సాయంత్రం ఆరు గంటలకు హంటింగ్‌కు బయలుదేరదామా?'' భోజనం పూర్తయిన తర్వాత నాప్‌కిన్‌తో మూతి తుడుచుకుంటూ అడిగాడు రాంబాబు

'అలాగే చేద్దాం నైట్ టైమ్‌లోనే హంటింగ్ బాగుంటుంది ' అన్నాడు ఆవులిస్తూ లోహియా

అతనికి నిద్ర వస్తోందని గమనించి-"అయితే మీరు కాసేపు రెస్ట్ తీసుకోండి సర్'' అన్నాడు కిషోర్

' ఆల్‌రైట్ రాత్రంతా ఎలాగు మేలుకుని ఉండాలి కదా కాసేపు నడుం వాలుస్తాను మీరూ పడుకోండి'' అనేసి తన గదిలోకి వెళ్లిపోయాడు లోహియా

అతను అటు వెళ్ళగానే జాకబ్ తేలిగ్గా నిట్టూర్చి "అమ్మయ్య ముసలాడు ఇప్పటికి వదిలాడు. పొద్దున్నుంచి సిగరెట్ కాల్చుకోవాలని తెగ కోరికగా ఉంది కానీ పెద్దాయన ముందు ఎలా కాలుస్తాం అని ఆ కోరికని బలవంతాన అణుచుకున్నాను ఇక నావల్ల కాదు'' అంటూ జేబులోంచి సిగరెట్ పాకెట్ బయటకు తీశాడు

"నా పరిస్థితి అంతే హడావిడిలో సిగరెట్లు కొనడం మరిచిపోయాను కానీ-నాకూ ఓ సిగరెట్ ...' జేబులు తడుముకుని, చెయ్యి చాపాడు కిషోర్

"డబ్బులు పెట్టి సిగరెట్ కొనుక్కొని నువ్వు ఎప్పుడు కాల్చావు కనుక ఇదిగో తీసుకో'' విసురుగా సిగరెట్ అతనికి అందించాడు జాకబ్

వాళ్ళిద్దరి సంభాషణ విని నవ్వుకున్నాడు రాంబాబు

సిగరెట్టు ముట్టించుకుని తృప్తిగా ఒక దమ్ము పీల్చి- "అది సరేగాని, ఎటూ కాని ఈ సీజన్‌లో వేట ప్రోగ్రాం పెట్టావు ఏమిటీ విశేషం?'' చాలా కాజువల్‌గా అడిగాడు జాకబ్

కానీ అతను అడిగిన తీరుకు గతుక్కుమన్నాడు రాంబాబు అయితే చప్పున ఎక్స్‌ప్రెషన్స్ మార్చివేసి "అబ్బే మరేం లేదు మనం వేటకు వెళ్లి చాలా కాలం అయింది కదాని ఇప్పుడు ఎరేంజ్ చేశాను అంతే' అన్నాడు రాంబాబు తడబడుతూ

## ప్రాణ్ కొడుకు చిత్రం

కొన్ని సంవత్సరాల క్రితం 'ఫరిష్టా' చిత్రానికి దర్శకత్వం వహించిన మన్‌మోహన్ దేశాయికి అసిస్టెంటుగా ప్రముఖ విలన్ ప్రాణ్ కుమారుడు సునీల్‌సికంద్ పని చేశాడట. ఇతను అడుగు పెట్టిన వేళా విశేషం అది ఫ్లాప్ అయి కూర్చుంది. ఇప్పుడు మళ్ళీ కొడుకు చిత్ర నిర్మాణం చేపట్టటంతో గత అనుభవం గుర్తు కొచ్చిన ప్రాణ్ జాగ్రత్త పడి సురేష్ భగత్‌ను నిర్మాతగా ఎంచుకున్నాడట. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రంలో ప్రాణ్‌తో పాటు జాకీ ష్రాఫ్, నసీరుద్దీన్‌షా, డానీ కూడా నటిస్తున్నారు.

అతని వంక వింతగా చూశాడు జాకబ్

ఇంతలో కిషోర్ అందుకుని- పోనిలేవోయ్ మెకానికల్ అయిపోయిన మన బతుకులకు ఈ హంటింగ్ ఒక రిలీఫ్ ఈ ప్రపోజల్ పెట్టి రాంబాబుసార్ మంచి పనే చేశారు అని రాంబాబుని సమర్థించాడు

మీరు మాట్లాడుతూ ఉండండి నేను లోపలికి వెళ్ళి ఒక కునుకు తీస్తాను ' అవులింత నటించి వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు రాంబాబు

అలాగే వెళ్ళి పడుకో నీకూ ఆ ముసలాడి 'లక్షణాలు బాగా వంటబడుతున్నాయిలే అన్నాడు వ్యంగ్యంగా జాకబ్

నవ్వుకుని లేచి ఇవతలికి వచ్చాడు రాంబాబు

నిజానికి జాకబ్ కిశోర్‌లు రాంబాబుకు జూనియర్స్ అయితే ఒకే ఏజ్ గ్రూప్ వారు కావడంతో జోవియల్‌గా ఉంటారు ఇద్దరిలోకి జాకబ్‌కి రాంబాబు దగ్గర చనువు ఎక్కువ.

రాంబాబు రూమ్‌లోకి వచ్చి తలుపు దగ్గరికి వేశాడు.

దూరం నుంచి వాళ్ళిద్దరి మాటలు సన్నగా వినిపిస్తున్నాయి.

మంచం మీద పడుకున్నాడు. నిజానికి అతనికి నిద్ర రావడం లేదు. కానీ జాకబ్ అసాధ్యుడు. అవులిస్తే పేగులు లెక్కపెట్టే రకం. అతనితో ఎక్కువగా మాట్లాడితే తన ప్లాన్ పసికట్టే ప్రమాదం ఉంది. అందుకే మధ్యలో లేచి వచ్చేశాడు.

అప్రయత్నంగానే రాంబాబుకి ఇందాకటి షికారీ శవం కళ్ళ ముందు కదలాడింది.

అతను నిజంగానే తుపాకీ పేలడం వల్ల మరణించాడా లేక తనలాగే ఎవరన్నా ప్లాన్ వేసి చంపారా?

ఏమో గానీ అతని సంగతి తనకెందుకు గానీ లోహియాని మాత్రం తను తెలివిగా చంపాలి.

ఆలోచనలతో ఎప్పుడు నిద్ర పట్టిందో అతనికే తెలీదు.

ఎవరో తట్టి లేపుతుంటే అతనికి చటుక్కున మెలుకువ వచ్చింది.

కళ్ళు నలుపుకుని చూశాడు.

"ఏం నాయనా. ఇక నన్ను లేస్తావా?ఇప్పుడు నిలయంలో సమయం ఆరుగంటలు. ముసలాడు నిన్ను కలవరిస్తున్నాడు" అన్నాడు జాకబ్ రాంబాబు భుజం మీద చెయ్యి వేస్తూ.

"జస్ట్ ఫైవ్ మినిట్స్" అంటూ బాత్‌రూమ్‌లోకి పరిగెత్తాడు రాంబాబు.

చకచక రెడీ అయి రూమ్‌లోంచి బయటకి వచ్చాడు. అప్పటికే హంటింగ్ సూట్స్‌తో తయారుగా ఉన్నారు.

రాంబాబును చూడగానే– "బాగా నిద్ర పోయారా?" అన్నాడు లోహియా పలకరింపుగా.

రాంబాబు సిగ్గుపడిపోయి– "లేదు సార్. పడుకోగానే అలా నిద్ర పట్టేసింది" అన్నాడు.

'నెవర్ మైండ్ ఇక బయలుదేరదామా? '

ఓ కె సార్ అన్నారు ముగ్గురు ఒకేసారి

యాదగిరి గన్స్ తెచ్చి జీపులో పెడుతుంటే ఓరకంటితో చూశాడు రాంబాబు

వేట కోసం షాట్‌గన్ ఉపయోగిస్తాడు లోహియా ఆ విషయం తెలుసుకుని తనూ షాట్‌గన్ తెచ్చాడు

జీప్ ఎక్కబోతూ ఒకసారి జేబు తడుముకున్నాడు రాంబాబు చేతికి బుల్లెట్స్ తగిలాయి

అవి పాయింట్ 12 బుల్లెట్స్

ఆ బుల్లెట్స్‌నే లోహియా ఉపయోగిస్తుంటాడు అతని వేలుతో నే అతని కన్ను పొడవడానికి ప్లాన్ వేసి ఆ బుల్లెట్స్ సంపాదించాడు రాంబాబు

అడవిలో కొంత దూరం వెళ్ళాక జీపు ఒకచోట ఆగింది

అక్కడ ఏపుగా పెరిగిన చెట్ల మధ్య నుంచి దారి చేసుకుని కొంచెం లోపలకు వెళితే రాంబాబు ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన హంటింగ్ ప్లాట్ ఫారమ్స్ వస్తాయి.

జీపు ఆగగానే ఈ విషయం చెప్పాడు రాంబాబు. వెంటనే మిగతా వాళ్ళు తమ గన్స్‌ని తీసుకుని కిందకు దిగారు.

రాంబాబు ముందు నడుస్తూ దారి చూపుతుంటే అతని వెనుకే నడుస్తున్నారు మిగతా వాళ్ళు.

ఎండిన ఆకుల మీద బూట్ల కాళ్ళు పడుతుండటంతో తమాషా శబ్దం వినిపిస్తోంది.

పరిసరాలను ఆసక్తితో గమనిస్తూ ముందుకు నడుస్తున్నాడు లోహియా.

జాకబ్ దగ్గర అడిగి తీసుకున్న సిగరెట్‌ను రహస్యంగా కాలుస్తూ అందరి కంటే వెనుక నడుస్తున్నాడు కిశోర్.

పది నిముషాలు అలా నడిచి ప్లాట్ ఫారమ్స్ చేరుకున్నారందరూ.

ప్లాట్ ఫారమ్స్ అంటే మరేమిటో కాదు. పొలాలలో ఏర్పాటు చేసే మంచె లాంటివి. నేలకు పది అడుగుల ఎత్తులో వీటిని నిర్మిస్తారు. వీటి పైకి ఎక్కడానికి తాళ్లతో నిచ్చెన తయారు చేస్తారు.

కింద నుంచి జంతువులు వెడుతుంటే స్పష్టంగా కనిపించడానికి గురి తప్పకుండా కాల్చడానికి ఇలాంటి మంచెలు ఏర్పాటు చేసుకుంటారు కొందరు షికారీలు

మంచె మీద నుంచి కిందకు దిగకుండా రోజుల తరబడి జంతువుల కోసం వేచి ఉండే షికారీలూ ఉన్నారు

మంచె మీదుంటే ఎవరూ పొరపాటున కూడా సిగరెట్ తాగకూడదు సిగరెట్ కాలవడం వల్ల ఆ పొగాకు వాసనని పసికట్టి జంతువులు తమ స్థానాలు వదిలిపెట్టి బయటకు రావు

చెట్లలో కలిసిపోయేటట్టుగా ఉండే ఈ మంచెలను పసి కట్టలేక వాటి కిందకు జంతువులు వచ్చి షికారీల తుపాకీ గుళ్లకు బలయిపోయిన సందర్భాలు అనేకం

వేటకు తన వేట'కు ఈ ప్లాట్ ఫారమ్స్ అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటాయని రెండు రోజుల ముందు వచ్చి కూలీల సాయంతో వాటిని నిర్మించాడు రాంబాబు.

"ఇవే సార్ మన ప్లాట్ ఫారమ్స్ ఇదుగో ఇది మీది అదుగో... ఆ చెట్ల పక్కన కనిపించేది నాది జాకబ్ కిశోర్‌ల ప్లాట్‌ఫారమ్స్ కొంచెం దూరంలో ఉన్నాయి" చెప్పాడు రాంబాబు.

ఆ 'ప్లాట్‌ఫారంను పరిశీలించి తృప్తిగా తల పంకించి- "మార్వలెస్, వండ్రఫుల్ ఎరేంజ్‌మెంట్స్ ఈ స్పాట్ నాకు బాగా నచ్చింది సంతోషంతో చెప్పాడు లోహియా.

"ముసలాడు తెగ సంబరపడిపోతున్నాడు ఈ స్పాట్‌లోనే తన కోసం మృత్యువు పొంచి ఉందని పాపం ఇంకా తనకి తెలీదు" అని మనసులో అనుకుని పైకి మాత్రం "థాంక్యూ సర్ అని వినయం ప్రదర్శించాడు రాంబాబు.

తాడుతో చేసిన నిచ్చెన మీదుగా చకచకా మంచె పైకి ఎక్కి- 'ఓ కె జంటిల్‌మన్ నేనిక్కడ సెటిల్

## బచ్చన్ సలహాదారులు

మంత్రులకు సలహాదారులుండటం సహజమే. కాని మన మాజీ ఎం.పి. ప్రముఖ చలన చిత్రనటుడు అమితాబ్ బచ్చన్‌కు కూడా ఇద్దరు సలహాదారులున్నారట. వాళ్లెవరో కాదు ప్రముఖ నటుడు శశికపూర్, జర్నలిస్టు వీరసంఘ్వీలు. వీళ్లిద్దరూ అమితాబ్‌కు చాలా సన్నిహితులే. పత్రికలకు నిజా నిజాలు వెల్లడించమని వాళ్లిద్దరూ బచ్చన్‌కు సలహా ఇచ్చారట. ఏ సందర్భంగా ఈ సలహా ఇచ్చారో పాఠకులు ఇట్టే ఊహించుకో వచ్చు కదూ!



## ఎలుక బోనులో 'చిరుత పిల్లి'

ఉత్తర- దక్షిణ బొంబాయిలోని బొరివిల్లి జాతీయ పార్కు సిబ్బంది ఎలుకను పట్టడానికై బోను పెట్టారట. మర్నాడు ప్రొద్దున లేచి చూస్తే పార్కు ఆఫీసు ఆవరణ బయట ఎలుకకు బదులు బోనులో ఓ చిరుతపిల్లి ఆగ్రహంతో కుప్పిగంతులు వేస్తూ బయటికి రావడానికై శతవిధాలా ప్రయత్నిస్తోందట.

పార్కు అధికారులు వచ్చి దానిని వెంటనే వసతిగా వుండే ఒక బోనులోకి పంపించారట.

రాత్రులు సంచరించే ఈ చిరుత పిల్లి అతి ప్రమాదకరమైన జంతువు. సాధారణంగా ఇది పెంపుడు కోళ్లను, పక్షులను వేటాడి చంపుతుందిట. అందుకే దీనిని మనుష్యులు వేటాడి చంపి దీని నివాసాలను ధ్వంసం చేస్తారట. అంతేగాక దీని అందమైన చర్మం కోసం కూడా మానవులు దీనిని చంపుతారట.

ఈ క్రూర జంతువు సామాన్యంగా అరణ్యాలలోనే నివసిస్తుందట కానీ అప్పుడప్పుడు జన సంచారం మధ్య పెద్ద చెట్ల తొర్రలలో నివసిస్తుందట. ఇవి దేశవ్యాప్తంగా వున్నాయట.

అయిపోతున్నాను. పునర్దర్శనం రేపు మార్నింగ్ ఎవరి స్కోర్ ఎంతెంతో అప్పుడే తేల్చుకుందాం సీ యూ" అని చేతులు ఊపాడు లోహియా

యాదగిరి చేత బెడ్, భోజనం కారియర్, వాటర్ బాటిల్, ఫ్లాస్కు నిండా టీ పైన పెట్టించాడు రాంబాబు

తర్వాత లోహియా దగ్గర సెలవు తీసుకుని కిషోర్, జాకబ్‌లకు మంచెలు చూపించి, తన మంచె చేరుకునేసరికి గంట పట్టింది

జీప్ తీసుకుని యాదగిరి గెస్ట్ హౌస్‌కు వెళ్ళిపోయాడు తెల్లారి ఆరింటికల్లా తిరిగి రమ్మని చెప్పాడతనికి రాంబాబు

మంచెపైకి ఎక్కాడు రాంబాబు

శీతాకాలపు రాత్రి కావడంతో చలి వణికిస్తోంది ఓవర్‌కోటును ముందుకు లాక్కుంటూ లోహియా మంచె వేపు చూశాడు

చీకటికి అలవాటు పడిన అతని కళ్లకి జంతువుల కోసం మాటు వేసుకుని కూర్చున్న లోహియా అస్పష్టంగా కనిపించాడు

అతని పెదాలపై విషపు నవ్వు వెలిసింది.

లోహియా చావుకు రేపు ముహూర్తం పెట్టాడు రాంబాబు

లోహియాను చంపింది తనే అన్న విషయం ఏమాత్రం పోలీసులకు తెలియకూడదు. అందుకే వేట గురించి పట్టించుకోవడం మానేసి ఆ విషయమే ఆలోచించసాగాడు.

అడవి అంతా నిశ్శబ్దంగా ఉంది

అర్ధరాత్రి వరకూ అలా ఆలోచిస్తూనే కూర్చున్నాడు రాంబాబు

తర్వాత నిద్రతో కళ్ళు కూరుకుపోసాగాయి

దూరంగా ఎవరో తుపాకి పేల్చిన శబ్దం

ఎవరా అని ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు రాంబాబు

తెల్లారి జీపు డ్రైవర్ మూడు సార్లు హారన్ మోగిస్తుంటే మెలుకువ వచ్చింది రాంబాబుకి

బద్ధకంగా వళ్ళు విరుచుకుని వాచీ వంక చూసుకున్నాడు

ఆరున్నర!

అడవిలో సందడి మొదలయింది దూరంగా పక్షులు శ్రవణానందకరంగా సంగీతాన్ని వినిపిస్తున్నాయి ఒక వడ్రంగి పిట్ట చెదపురుగుల కోసం లయబద్ధంగా చెట్టును కొడుతోంది.

చకచకా బెడ్‌ను చుట్టేసి భుజాన వేసుకుని కిందకు దిగాడు

వేగంగా నడిచి లోహియా మంచెను చేరుకున్నాడు. హారన్ మోత వినిపించడంతో అతనూ కిందికి దిగాడు నిద్ర లేమి వల్ల లోహియా కళ్ళు ఎర్రబారాయి.

"గుడ్‌మార్నింగ్ సర్ రాత్రివేటినన్నా షూట్ చేశారా?" అడిగాడు రాంబాబు

సరిగ్గాఅప్పుడె జాకబ్, కిషోర్ అక్కడికి వచ్చారు

"ఏమీ దొరకలేదు రాంబాబు బహుశా మనం మాటు వేసి కూర్చున్నట్లు వాటికీ తెలిసిపోయినట్లుంది" నిరాశగా చెప్పాడు లోహియా

పావు గంట తర్వాత నలుగురు గెస్ట్ హౌస్‌లో ఉన్నారు

పొగలు కక్కే వేడి కాఫీ తీసుకు వచ్చి అందరికీ ఇచ్చాడు యాదగిరి

అది తాగగానే అందరికీ పోయిన ప్రాణాలు తిరిగి వచ్చినట్లయింది.

కాసేపు ఆ కబురు ఈ కబురు చెప్పిన తర్వాత స్నానాలు చేసి వస్తామని చెప్పి అక్కడి నుంచి జారుకున్నారు కిషోర్, జాకబ్

రాంబాబు అలా చేయలేక లోహియా పక్కనే కూర్చున్నాడు.

గుప్పు గుప్పుమని పైప్ పీలుస్తున్న లోహియా ఉన్నట్టుండి- "రాంబాబూ మనకు ఫోన్ వస్తే మెసేజ్ అందుకునే వాళ్ళు ఎవరైనా ఉన్నారా?" అని ప్రశ్నించాడు

ఆ హాలులో మూలగా ఉన్న ఫోన్‌ని గమనించి- "యాదగిరి, జీప్ డ్రైవర్ ఇక్కడే ఉంటున్నారు కదా సార్ వాళ్ళే రిసీవ్ చేసుకుంటారు" అన్నాడు రాంబాబు

"నో అది ఇంపార్టెంట్ కాల్ మన చైర్మెన్ గారి పి.ఎ. ప్రకాష్ నుంచి ఫోన్ రావాలి సరేలే నేను ఇవాళ వేటకి రాను మీరు వెళ్లండి" అనేసి పైప్ నోట్లో పెట్టుకున్నాడు లోహియా

రాంబాబుకు గుండాగినంత పనయింది ఇవాళ ఒక్క రోజే తనకి చాన్స్ అది మిస్సయితే మళ్లీ ఎప్పటికి దొరుకుతుందో? లోహియా వేటకు రాకపోతే తన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు లాగే వృధా అవుతాయి

అందుకే వెంటనే- "మీరెందుకు సార్ వేట మానుకోవడం? నేను ఇక్కడే ఉంటాను మీరు వెళ్లండి" అన్నాడు

రాంబాబు మొహంలోకే చూస్తూ- "నాకు ఫోన్ వస్తే నువ్వు ఇక్కడ ఉండి ఏం చేస్తావు?" అన్నాడు లోహియా

రాంబాబు గతుక్కుమని- "అబ్బే నా వుద్దేశ్యం ఏమిటంటే మీరు వేటకు వెడదామని ఎప్పటి నుంచో అంటున్నారు. పైగా రాత్రి కూడా వేట జరగలేదు అందుకే మీరు వెడితే నేను ఇక్కడే ఉండి మెసేజ్ నోట్ చేసుకుంటాను" అన్నాడు కంగారుగా

అతని కంగారు చూసి పగలబడి నవ్వి- "సరదాగా జోక్ చేశాను లేవోయ్ కంగారు పడకు" అని "అయితే ఒక పని చేద్దాం. సాయంత్రం ఆరు గంటల వరకూ ఇక్కడే ఉంటాను. ఈ లోపు ఫోన్ వస్తే సరేసరి. తర్వాత నేను వేటకు వెళ్ళిపోతాను నువ్వే ఇక్కడే ఉండి మెసేజ్ నోట్ చెయ్యి. ఓ కె?" అన్నాడు

సరేనన్నట్లుగా తల ఊపాడు రాంబాబు

"అయితే నువ్వు వెళ్ళి రెస్ట్ తీసుకో" అనేసి తను పైప్ పీల్చడంలో నిమగ్నమయ్యాడు లోహియా.

'థాంక్ గాడ్' అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు రాంబాబు

సాయంత్రం ఆరింటి వరకూ అలాగే కదలకుండా కూర్చున్నాడు లోహియా మధ్యలో స్నానానికీ, భోజనానికీ మాత్రం లేచి వెళ్ళి మళ్ళీ వచ్చి అలాగే ఫోన్ పక్కనే కూర్చున్నాడు

ఆ ఫోన్‌కాల్‌కు లోహియా ఎందుకంత ప్రాధాన్యత ఇస్తున్నాడో రాంబాబుకు అర్థంకాలేదు.

కిషోర్, జాకబ్ వేటకు ఎప్పుడో వెళ్ళిపోయారు. తామిద్దరం తర్వాత వస్తామని లోహియా చెప్పడంతో వాళ్ళు మనసులో సంతోషిస్తూ వెళ్ళిపోయారు.

ఫోన్ అప్పటికి కూడా రాకపోవడంతో తనూ వేటకి వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు లోహియా.

జీప్ ఎక్కబోతూ ఆగిపోయి, ఏదో సందేహిస్తున్న వాడిలాగా రెండడుగులు వెనక్కి వేసి- "రాంబాబూ నువ్వేమీ అనుకోనంటే నీ ప్లాట్‌ఫారం మీద నేను కాపు

కాస్తాను. నీకు అభ్యంతరం లేదుగా" అన్నాడు లోహియా.

అతను అలా అడిగేసరికి ఆశ్చర్య పోయాడు రాంబాబు. తన ప్లాన్ పసికట్టలేదుకదా అనే అనుమానం కూడా కలిగింది.

నిజానికి లోహియా తన మంచెమీద ఉంటే తన పని మరింత సులువు. "అడబోయిన తీర్థం ఎదురయినట్టు" లోహియా స్వయంగా అలా అడిగే సరికి ఉప్పొంగి పోయాడు రాంబాబు

సమాధానం కోసం లోహియా తనవంకే చూస్తుండటం గమనించి తన ఫీలింగ్స్ అతికష్టం మీద దాచుకుని– "ఏంలేదు సార్ మీ ఇష్టం వచ్చిన చోట ఉండవచ్చు" అన్నాడు

జీప్ కదిలింది

వెళ్లేముందు ఫోన్‌రాగానే తనకు వచ్చి చెప్పడం మరిచిపోవద్దని మరోసారి హెచ్చరించాడు లోహియా

అంతా అనుకున్నట్టుగానే జరుగుతున్నందుకు లోలోపల మురిసి పోయాడు

ఇక ఆ "పని" ఒక్కటే మిగిలిఉంది అనుకుంటూ సిగరెట్ వెలిగించాడు రాంబాబు

అతను మనిషిని ఎప్పుడూ చంపలేదు హత్య చేయడం ఇదే మొదటిసారి కావడంతో మెంటల్‌గా ప్రిపేర్ అవుతున్నాడు అందుకే అలవాటు లేకపోయినా సిగరెట్ వెలిగించాడు.

లోహియాను మంచె దగ్గర దింపేసి జీప్ వెనక్కి వచ్చేసింది కారిడార్‌లో ఉన్న మెట్లపై కూర్చుని యాదగిరితో కబుర్లకు దిగాడు డ్రైవర్.

గంట గడిచింది.

ఫోన్ రాలేదు

సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ అలాగే కూర్చున్నాడు రాంబాబు

మరో అరగంట గడిచింది

ఇంతలో హఠాత్తుగా షాట్ గన్ పేల్చిన శబ్దం నిశ్శబ్దత అలముకున్న ఆ ప్రదేశంలో భయంకరంగా ప్రతిధ్వనించింది.

ఆ ధ్వని సమీపం నుంచే వినిపించడంతో లోహియా ఏదన్నా జంతువును కాల్చి ఉంటాడని అనుకున్నాడు.

కుర్చీలోంచి లేచి అటూ ఇటూ తిరుగుతూ వాచీ వంక చూసుకున్నాడు

లోహియా వెళ్ళి దాదాపు రెండుగంటలవుతోంది

ఫోన్ ఇంకా రాలేదు.

ఎదురు చూసి చూసి విసుగు పుట్టింది అనుకున్న సమయానికి పని పూర్తి చేయకపోతే తర్వాత కష్టం

ఏదన్నా పెద్ద జంతువును చంపి, ఆ ఆనందంతో లోహియా వేటకు స్వస్తి చెప్పి వెనక్కి తిరిగివస్తే తన పని ఇంతేసంగతులు

మళ్లీ ఇలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తూ ఈ ముసలాడికింద పని చేయాలి

అయినా చనిపోయేవాడికి ఇంకా ఫోన్‌కాల్ ఎందుకు? అనుకుని తనూ అడవిలోకి వెళ్లడానికి తయారు కాసాగాడు

జీన్స్ జాకెట్ వేసుకుని, పైన హెవీకోట్ తొడుక్కున్నాడు గ్లోవ్స్‌ని కోట్ జేబులో పెట్టుకుని, బుల్లెట్స్ భద్రంగా ఉన్నాయో లేవోనని చూశాడు

జీప్ డ్రైవర్ వస్తానని ముందుకు వస్తే అతన్ని వద్దని వారించి, యాదగిరితో "పెద్ద దొరగారికి ఫోన్ వస్తే మెసేజ్ నోట్ చేసుకో" అని చెప్పి షాట్‌గన్ తీసుకుని మట్టిరోడ్ ఎక్కాడు రాంబాబు

వాతావరణం అంతా– నిశ్శబ్దంగా ఉంది.

అతని బూటుకాళ్లు ఎండు ఆకులమీద పడటంతో చిత్రంగా శబ్దమవుతోంది అటూ ఇటూ తిరుగుతున్న పాములు, కుందేళ్లు ఆ శబ్దానికి భయపడి దూరంగా పారిపోతున్నాయి

ఆకాశాన్ని అంటేట్టు ఉన్న ఎత్తయిన చెట్లు ఆ చీకట్లో జుట్టు విరబోసుకున్న దయ్యాల లాగా అగుపిస్తున్నాయి.

కొండల మీద నుంచి దొర్లిన పెద్ద పెద్ద రాతిబండలు, వాటి చుట్టూ పెరిగిన ముళ్ల పొదలు, వాటిలో ఇళ్లు కట్టుకున్న సర్పజాతి అడవిలో నడవడం తెలియని వాడి ప్రాణాలు హరించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

రాంబాబుకి ఇవన్నీ సుపరిచితాలే ఎన్నోసార్లు ఆ అడవిలో తిరిగాడు అందుకే చీకట్లో కూడా తడుముకోకుండా ముందుకు పోతున్నాడు

కాసేపటికి లోహియా ఉన్న మంచె చేరాడు

"సార్' అని పిలిచాడు

ఎక్కడా అలికిడి లేదు

"లోహియా సార్' ఈసారి కొంచెం బిగ్గరగానే పిలిచాడు

అతని పిలుపు అడవిలో ప్రతిధ్వనించింది కానీ లోహియా మాత్రం బదులు పలకలేదు

"ఎక్కడికి వెళ్లాడబ్బా అనుకుంటూ మంచె ఎక్కాడు రాంబాబు

తన కోట్ మీద వెల్లకిలా పడుకుని ఉన్నాడు లోహియా కాళ్లు, చేతులు వెడంగా ఉన్నాయి షాట్‌గన్ పక్కనే పడుంది

అతను పడుకున్న తీరు రాంబాబుకు ఎందుకో అనుమానం రేకెత్తించింది దగ్గరకు వెళ్లాడు


అతని అనుమానమే నిజమయింది

లోహియా శాశ్వత నిద్రలో ఉన్నాడు అతన్ని హత్య చేశారు ఎవరో! అతని వెన్నులోంచి బుల్లెట్ దూసుకుపోయింది.

లోహియా శవాన్ని చూసి పైశాచికంగా నవ్వుకున్నాడు రాంబాబు

తను ఏ పద్ధతిలో అతన్ని చంపాలనుకున్నాడో సరిగ్గాఅదే విధంగా చంపారెవరో అతన్ని!"

"పీడ విరగడయింది ఈ రోజు నుంచి తను మార్కెటింగ్ మేనేజర్" కసిగా అని లోహియా శవాన్ని



కాలితో తన్నాడు

ఇంతలో అతని చెంప ఛెళ్ళుమనిపించేలాగా ఏదో విషయం గుర్తుకు వచ్చింది

లోహియా ఉన్నది తన మంచె మీద అతను ఇక్కడున్న విషయం తనకూ, జీప్ డ్రైవర్‌కూ, యాదగిరికి తప్ప మరవరికీ తెలీదు

లోహియా తను ఒకే ఎత్తు, లావుతో ఉంటారు దూరం నుంచి చూస్తే ఇద్దరూ ఒకేలాగా ఉంటారు

ఒకవేళ తను అనుకుని లోహియాని హత్య చేయలేదు కదా?!

తన ఆలోచనకు తనే వణికిపోయాడు రాంబాబు

ఇంతకీ ఈ హత్య చేసింది ఎవరు?

కిషోరా? జాకబా??

తనని చంపడం వల్ల వాళ్ళకి ఏమిటీ ఉపయోగం?

వాళ్ళిద్దరు తన జూనియర్స్ అన్న విషయం అప్పుడే గుర్తుకు వచ్చింది రాంబాబుకు .

అంటే ప్రమోషన్ కోసం తను లోహియాను ఎలా అడ్డు తొలగించుకోవాలనుకున్నాడో, వాళ్ళూ అలాగే తనని తుదముట్టిద్దామనుకున్నారన్న మాట!

ఎంత దారుణం?

ఎంత నమ్మకద్రోహం??

అంత బాధలో ఉన్నప్పటికీ అతనికి ఈ మాటలు అనుకునేసరికి నవ్వొచ్చింది

ఐదు నిముషాల క్రితంవరకూ తను లోహియాను వెన్నుపోటు పొడుద్దామనే ఆలోచనలోనే ఉన్నాడు

## కుర్ర బిచ్చగాళ్లు

తన ఓటుతో తన కళ్లనే పొడవగా
తయారైన గుడ్డివాళ్లను
బిచ్చగాళ్లుగా చేసి
డబ్బు చేసుకుంటున్న
నేటి ప్రజాస్వామ్యం
వాటాలు కుదరక
పెంచింది మరో ముప్పైఐదు మిలియన్ల
అంధకుర్రాళ్లని
కుర్ర బిచ్చగాళ్లని!

-ఎన్. జగన్నాధరావు

## వేట

కానీ తన విషయానికి వచ్చేసరికి "నమ్మకద్రోహం లాంటి మాటలు పుట్టుకు వస్తున్నాయి

అందుకే కాబోలు 'తన దాకా వస్తేగాని తెలీదు' అని అన్నారు

ఆలోచనలు పక్కకు నెట్టి మంచె మీద నుంచి కిందకు దిగాడు రాంబాబు

లోహియా శవాన్ని గెస్ట్‌హౌస్‌కు తీసుకు వెడదామనే ఆలోచన కూడా లేకుండా వికలమైన మనసుతో వెనుతిరిగాడు

గెస్ట్ హౌస్‌కు చేరుకుని తన రూమ్‌లోకి వెళ్లబోతుండగా ఫోన్ మోగింది

అన్యమనస్కంగానే రిసీవర్ ఎత్తి "హలో" అన్నాడు.

అవతలి వైపు లైన్లో పి ఎ ప్రకాష్ ఉన్నాడు

లోహియా లేడని చెప్పగానే, అతనికొక విషయం చెప్పమని అంటూ ఆ విషయం రాంబాబుకు చెప్పాడు

లోహియాకు రిటైరైపోవాలనే కోరిక కొన్ని నెలల నుంచి ఉంది తన శేష జీవితాన్ని వేటలో గడపాలని అతని ప్లాన్ అందుకే తన బాస్ బరద్వాజకి ఈ విషయం చెప్పి, తన పోస్ట్‌లోకి రాంబాబును ప్రమోట్ చెయ్యమని రికమెండ్ చేశాడు లోహియా బరద్వాజ వెంటనే ఒప్పుకోకపోయేసరికి, తను వేటకు వెడుతున్నాననీ, తను అక్కడున్న సమయంలోనే బరద్వాజా ఏ విషయం చెప్పాలనీ కోరి తను అడవికి వచ్చేశాడు లోహియా అతని అబిమతం మేరకు రాంబాబును మార్కెటింగ్ మేనేజర్‌గా నియమించడానికి బరద్వాజ ఆ తర్వాత అంగీకరించాడు ఇదీ ప్రకాష్ ఫోన్‌లో చెప్పిన విషయం

మార్కెటింగ్ మేనేజర్‌గా ప్రమోషన్ లబించినందుకు తన అదృష్టానికి పొంగి పోవాలో లేక ఆ ప్రమోషన్ రావడానికి కారకుడయిన లోహియా మరణానికి కుంగిపోవాలో తెలియక ఎటూతోచని అచేతనావస్థలో పడి శిలా ప్రతిమలాగా నిలబడి పోయాడు రాంబాబు

○